క్లుప్తంగా

వైభవంగా భావనారుషి కల్యాణం



రేపల్లె రూరల్: పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లో వేంచేసియున్న భద్రావతీ సమేత భావనారుషి స్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ స్వామి వారికి, అమ్మ వారికి మంగళస్నానాలు చేయించి వధూవరులుగా అలంకరించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక వాహనంలో పురవీధుల్లో గ్రామోమత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణలో స్వామి వారికి, అమ్మవారికి కల్యాణ మహోత్సవం కనుల పండువగా చేశారు. 3న అన్న సంతర్పణ, 4న వసంతోసేవ, 5న అమ్మవారికి సారె, పుష్పయాగం తదితర సేవలు నిర్వహించబడునని, ఆయా వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సోనియాపై చర్యలు తీసుకోవాలి

బీజేపీ నాయకులు



రేపల్లె రూరల్: రాష్ట్రపతి ద్రౌపదిముర్ముపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సోనియాగాంధీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పట్టణ బీజేపీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బోరింగ్, పూర్ లేడీ అని పార్లమెంట్ భవనం ఆవరణలో వ్యాఖ్యానించటం సోనియాగాంధీకి తగదన్నారు. భవిష్యత్‌లో రాష్ట్రపతిపై ఎవరూ ఇటువంటి అవమాన అనుచిత వ్యాఖ్యలు చేయకుండా ఉండాలంటే సోనియాగాంధీపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ బాపట్ల జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బేతపూడి వెంకటేశ్వరరావు, పిన్ని సాంబశివరావు, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు విద్యార్థికి కాంస్య పతకం



కొల్లూరు : రాష్ట్ర స్థాయిలో జరిగిన 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో కొల్లూరు కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల హెచ్ఎం గొరికపూడి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జనవరి 31న నిర్వహించిన బాలమహోత్సవ్ క్రీడోత్సవాలలో పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి ఎం.లోహిత్ కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. పరుగు పందెంలో రాణించిన విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మాజీ సైనికునికి ఘన స్వాగతం



చింతాయపాలెం (కర్లపాలెం): భారత సైన్యంలో చేరి దేశానికి విశేష సేవలందించి పదవీ విరమణ చేసి ఆదివారం స్వగ్రామం చింతాయపాలెం వచ్చిన జవాన్ లుక్కా నగేష్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో చిరు సన్మానం చేశారు. కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామానికి చెందిన లుక్కా నగేష్ 22 ఏళ్ల పాటు సైనికునిగా దేశానికి సేవలందించి పదవీ విరమణ చేశారు. నగేష్ ఆదివారం స్వగ్రామం వచ్చిన సందర్భంగా గ్రామస్తులు, మాజీ సైనికులు, యువకులు కర్లపాలెం ముకుంద టీ స్టాల్ వద్ద నుంచి ఊరేగింపుగా అతని ఇంటి వరకు తీసుకువచ్చి ఘనంగా సన్మానం చేశారు. తను ఊహించని విధంగా స్వాగత సత్కారాలు చేసిన గ్రామస్తులకు, మాజీ సైనికులకు నగేష్ ధన్యవాదాలు తెలిపారు.

దుమ్ము, ధూళి నడుమనే జీవనం

- నదీతీర గ్రామాలను పట్టి పీడిస్తున్న కాలుష్య భూతం
- నిబంధనలు అమలు చేయని యంత్రాంగం
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు

కొల్లూరు: పచ్చని పంట పొలాలతో.. ప్రశాంత వాతావరణం నడుమ అలరారాల్సిన కృష్ణా నదీ తీర గ్రామాలను కాలుష్య భూతం పట్టి పీడిస్తుంది. దశాబ్దాల తరబడి కాలుష్య కోరల నడుమ లంక గ్రామాల ప్రజలు రోగాలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇటుక పరిశ్రమ కారణంగా గాలి, నీరు, ధ్వని కాలుష్యంతో లంక గ్రామ వాసులు కాలుష్యం బారిన పడి ప్రమాదకరమైన జీవనాన్ని గడుపుతున్నారు. ఇటుక పరిశ్రమ నుంచి వెలువడుతున్న ఊక, బొగ్గు కాల్చిన పొగతో పాటు, దుమ్ము, ధూళి గాలిలో వ్యాపించి ప్రజలు పీల్చుకునే గాలి కలుషితమై శ్వాసకోశ, కంటి సంబంధిత వ్యాధులు, ఇతర జబ్బులతో కాలం గడుపుతున్నారు.

వ్యాధులు చుట్టుముడుతున్నాయి

రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నా పాలకులు, యంత్రాంగం మాత్రం మిన్నకుండటం లంక గ్రామాల వాసులకు ప్రాణ సంకటంగా పరిణమించింది. పచ్చని పంటలతో కళకళలాడాల్సిన లంక గ్రామాలు ఇటుక పరిశ్రమ కారణంగా దుమ్ము కొట్టుకుపోయి కునారిల్లుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇటుక పరిశ్రమతో వ్యాపిస్తున్న కాలుష్యం కారణంగా ప్రజలను ప్రాణాంతక వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ఇటుక రాయి పరిశ్రమ ద్వారా వెలువడుతున్న కాలుష్యం నుంచి కాపాడాలంటూ జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు గతంలో ప్రజలు విన్నపాలు సమర్పించినా చర్యలు చేపట్టిన పాపాన పోకపోవడంతో ప్రజలలో ఆందోళన వ్యక్తమవుతుంది.



పరిసరాలు కనిపించని రీతిలో ఇటుక బట్టీ నుంచి వెలువడుతున్న పొగ



దుమ్ము, ధూళితో కప్పబడి ఉన్న మొక్కజొన్న పంట



గాజుల్లంక రోడ్డులో దుమ్ముతో నిండిపోయి ఉన్న చెట్లు

తీరప్రాంత లంక గ్రామాలకు శాపం

ఇటుక పరిశ్రమ లంక గ్రామాలకు శాపంలా మారింది. ఇటుక పరిశ్రమ నిర్వహించే ఐదు నెలల కాలంతో పాటు, ఏడాది మొత్తం వ్యాపిస్తున్న దుమ్ము, ధూళి కారణంగా వాతావరణం కలుషితమవుతుంది. నిబంధనల మేరకు.. రహదారులు, గ్రామాలు, పంట భూములు, నదీ పరీవాహక ప్రాంతాల వెంబడి ఇటుక పరిశ్రమ నిర్వహించకుండా చర్యలు చేపట్టాల్సి ఉన్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో అమాయకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇటుక పరిశ్రమ ద్వారా వ్యాపిస్తున్న కాలుష్యంతో శ్వాసకోశ వ్యాధులు, ఎలర్జీలు బారిన పడి ప్రజలు సతమతం అవుతున్నారు. చిన్నపిల్లలు, గర్భిణులపై కాలుష్య ప్రభావం అధికంగా ఉంటుంది.

కోర్టు తీర్పులు అమలు నిల్

ఇటుక పరిశ్రమ ద్వారా వ్యాపిస్తున్న కాలుష్యం, సహజవనరులకు వాటిల్లే ముప్పు, గ్రామాలకు వాటిల్లే నష్టాలను దృష్టిలో ఉంచుకుని గతంలో కోర్టులు ఇచ్చిన తీర్పు అమలుకు నోచుకోవడం లేదు. గ్రామాలకు, రహదారులకు సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఇటుక పరిశ్రమ ఉండరాదన్న ప్రధాన నిబంధనతోపాటు, వ్యవసాయ భూములను వ్యవసాయేతర కార్యకలాపాలకు వినియోగించడం, నది వెంబడి ఇటుక పరిశ్రమలు నిర్వహించరాదన్న వాల్టా చట్టానికి సైతం తూట్లు పడుతున్నా అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరించడం విమర్శనాత్మకమవుతుంది.

1200 ఎకరాలలో పరిశ్రమ

4 వేల మందికి పైగా జనాభా నివసిస్తున్న మండలంలోని పెసర్లంక, గాజుల్లంక, ఆవులవారిపాలెం, పోతార్లంక, తోకలవారిపాలెం, తురకపాలెం, తిప్పలకట్ట, కిష్కిందపాలెం ప్రాంతాలలో సమస్య తీవ్రత రోజురోజుకు అధికమవుతుంది. సుమారు 1200 ఎకరాలలో ఇటుక పరిశ్రమ విస్తరించి ఉన్న గ్రామాలతోపాటు సమీపంలోని ఇతర గ్రామాలపైన సైతం కాలుష్యపు ప్రభావం ఉండటంతో ప్రజలలో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇటుక పరిశ్రమకు అవసరమైన మట్టి, బుసక తవ్వకాలు సైతం ఇష్టానుసారం చేస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటడంతోపాటు, భూగర్భ జలాలపై కాలుష్య ప్రభావం పడుతుందన్న భావన ప్రజలలో వ్యక్తమవుతుంది.



పెసర్లంక రోడ్డులో చుట్టుముడుతున్న దుమ్ము

120 మందికి ఉచిత వైద్య పరీక్షలు

కర్లపాలెం: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడాలని ప్రముఖ మధుమేహ వైద్యులు చల్లా రామోహన్‌రావు తెలిపారు. రామకృష్ణ సేవా సమితిలో ఆదివారం పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 120 మంది మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ చల్లా రామోహన్‌రావు మాట్లాడుతూ మధుమేహ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆహార నియమాలు పాటించాలని చెప్పారు. రక్తపోటు వ్యాధిగ్రస్తులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత జీవనం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు బాపిరాజు, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, లలిత బాబు, వెంకట సుబ్బారావు తదితరులు ఉన్నారు.



ఐదు దశాబ్దాల అనంతరం అ'పూర్వ' కలయిక



భట్టిప్రోలు (కొల్లూరు) : విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, చిన్న నాటి తీపి జ్ఞాపకాలతో ఐదు దశాబ్దాల అనంతరం పూర్వ విద్యార్థులు సేద తీరారు. ఆదివారం భట్టిప్రోలు టీఎంరావు పాఠశాలలో 1972–73 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం రూపంలో కలుసుకున్నారు. పాఠశాలలో చిన్ననాటి గుర్తులను తలచుకుంటూ ఆనందంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకొని, వృద్ధాప్యంలోకి అడుగుపెడుతున్న అప్పటి విద్యార్థులు వయోభారాన్ని పక్కన పెట్టి తమ విద్యార్థి దశను గుర్తుతెచ్చేలా సంతోషకరమైన వాతావరణంలో ఉత్సాహంగా గడిపారు.

అంజుమన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్

బాపట్ల: అంజుమన్ ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంప్ ఘనంగా జరిగిందని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్ జానీ తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద గల అంజుమన్ ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు రహీం జానీ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 158 మంది వైద్య సేవలు సద్వినియోగం చేసుకున్నారన్నారు. అంజుమాన్ కమిటీ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఇదేవిధంగా అంజుమన్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ కూడా జారీ చేయడం జరిగిందన్నారు. అంజుమన్ సంస్థ ఒక సేవా దృక్పథంతో బాపట్ల పట్టణంలోని పేద వారికి అండగా నిలిచిందన్నారు. పేద విద్యార్థులకు స్కాలర్షిప్‌తో పాటు చనిపోయిన వారికి మట్టి ఖర్చులు, వైద్యం నిమిత్తం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. అంతేకాకుండా పట్టణంలోని బరియల్ గ్రౌండ్ బాగోగులు కూడా అంజుమన్ సంస్థ నిర్వహిస్తుందన్నారు. అనంతరం విశిష్ట అతిథి ఆడిటర్ చాపల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంజుమన్ సంస్థ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. దేవుడు అంజుమన్ సంస్థకు అండగా ఉండాలని తన వంతు పూర్తి సహాయ సహకారాలు కమిటీకి ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 30 మంది విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్లు అందించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జమ్రుద్ బాషా, జనసేన సమన్వయకర్త నామ వెంకట శివ నారాయణ, అంజుమన్ కమిటీ సెక్రటరీ అబ్దుల్ కరీం, కమిటీ సభ్యులు, మత పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్దుల్ రహీమ్ జానీ

కాకులను కొట్టి గద్దలకు వేసే విధంగా కేంద్ర బడ్జెట్


బాపట్ల: కేంద్రం ప్రకటించిన బడ్జెట్ కాకుల్ని కొట్టి గద్దలకు వేసే విధంగా ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండయ్య అన్నారు. కేంద్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు, రైతులకు తీరని అన్యాయం జరిగిందని ఆదివారం పట్టణంలో పాత బస్టాండ్ ఆటో స్టాండ్ వద్ద సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కొండయ్య మాట్లాడుతూ రైతులకు ఎరువులపై సబ్సిడీ, వ్యవసాయ కార్మికులు, పనికి ఆహార పథకానికి నిధులు తగ్గించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో ఏ మాత్రం చోటు దక్కకపోతే వికసిత భారత్ ఎలా వర్ధిస్తుందన్నారు. సంప్రదాయ పనికి ఆహార పథకానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. అదానీ, అంబానీలకు రెడ్ కార్పెట్లు పరిచే విధంగా బడ్జెట్ ఉందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ సామాన్య ప్రజల అవస్థలు పట్టించుకోని విధంగా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. ఉక్కు పరిశ్రమకు, విశాఖ రైల్వే జోన్‌కు బడ్జెట్ వల్ల తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని కళ్ల ముందే కనిపిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ఇది మంచి బడ్జెట్ అని మెచ్చుకోవడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ రాష్ట్ర తిరోగమనాన్ని సూచిస్తోందన్నారు. అట్టడుగు స్థాయి వర్గాలపై కనీస అవగాహన లేకుండా బడ్జెట్లో వారికి నిధులు కేటాయించి వారి అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం కేంద్ర బడ్జెట్ అద్దం పడుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వసంతరావు, శరత్, సుభాషిణి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

చేనేతల రుణాల విషయంలో బ్యాంకర్ల వైఖరి దారుణం

భట్టిప్రోలు (కొల్లూరు): చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితులు పెంపొందించేందుకు ముద్ర పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినా బ్యాంకర్ల వైఖరి కారణంగా అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందకుండా పోతున్నాయని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం భట్టిప్రోలులోని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు ముద్ర పథకం ద్వారా రుణాలు పంపిణీ చేసేందుకు అర్హులైన కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని చేనేత, జౌళి శాఖ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో సంబంధిత అధికారులు సహకార సంఘాల ద్వారా కార్మికుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను భట్టిప్రోలులోని యూనియన్ బ్యాంక్‌కు పంపినా రుణాలు మంజూరైన పాపాన పోలేదన్నారు. బ్యాంక్ అధికారులు దరఖాస్తులను పరిశీలించి కార్మికులను పిలిపించి తమ బ్యాంక్‌లో ఖాతాలు కలిగి ఉండటంతోపాటు, గత ఆరు నెలలుగా లావాదేవీలు చేస్తున్న వారికి మాత్రమే రుణాలు మంజూరు చేస్తామని ఆంక్షలు విధించడం దారుణమన్నారు. బ్యాంక్‌లో ఖాతాలు లేని కార్మికులకు నూతనంగా ఖాతాలు ప్రారంభించి, లావాదేవీలు లేని ఖాతాలను పునరుద్ధరించి అర్హులైన చేనేత కార్మికులకు ముద్ర రుణాలు మంజూరు చేసేలా జిల్లా కలెక్టర్, జిల్లా జౌళి శాఖాధికారులు చొరవచూపి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు, సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, చేతి వృత్తిదారుల సమాఖ్య సభ్యులు వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర చేనేత కార్మిక సంఘం నాయకులు

క్షతగాత్రులను ఆదుకోవడం అందరి బాధ్యత

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడినవారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెనాలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గుడ్ సమారిటన్ వాల్ పోస్టర్లను తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల, పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలల్లో తెనాలి రవాణా శాఖ అధికారులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రాఘవరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి త్వరితగతిన వైద్యసహాయం అందించి ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. గాయాలపాలైన వారికి సహాయం అందించే వారిని ఉద్దేశించి గుడ్ సమారిటన్ వాల్ పోస్టర్లను రవాణా శాఖ రూపొందించిందని తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడినవారిని త్వరితగతిన వైద్యశాలకు తరలించిన వారికి రూ. 5 వేలు నగదు ఇస్తారని చెప్పారు. క్షతగాత్రులను వైద్యశాలకు తీసుకువచ్చిన వారిని ఫారాలు నింపాలని, వైద్య ఖర్చులు చెల్లించాలని ఒత్తిడి చేయకూడదని, వారు వైద్యశాల నుంచి వెంటనే వెళ్లేందుకు అభ్యంతరం చెప్పకూడదని స్పష్టం చేశారు. బాధితులను ఆదుకున్న వారిని సాక్షులుగా ఉండాలని పోలీసులూ ఒత్తిడి చేసేందుకు వీలు లేదని, అవసరమైతే సాక్షిగా ఉండేందుకు అంగీకరిస్తారా అని వారిని అడిగి వారి సమ్మతంతోనే సాక్షిగా పోలీసులు చేరుస్తారని తెలిపారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లోపు వైద్యశాలలకు తరలిస్తే ప్రాణాన్ని కాపాడే వీలుంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి 10 మంది గుడ్ సమారిటన్‌లను ఎంపిక చేసి ట్రోఫీ, సర్టిఫికెట్‌తో పాటు రూ. లక్ష నగదు ప్రోత్సాహంగా అందిస్తుందని ఎంవీఐ రాఘవరావు తెలిపారు. ఆయన వెంట అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మధుసూదనరావు, జి.అమృతరాణి సిబ్బంది ఉన్నారు.



తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బందితో కలసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవాణా అధికారులు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

రేపల్లె రూరల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ అంశాన్ని గమనించి సహకరించాలని కోరారు.

10న అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కొల్లిపర: ఈనెల 12వ తేదీన పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలోని శివ పుణ్యక్షేత్రంలో గిరి ప్రదక్షిణ మహోత్సవాలకు వెళ్లే శివభక్తులకు గుంటూరు-2 డిపో నుంచి స్పెషల్ హైటెక్(2+2) పుష్ బ్యాక్ బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ ఆదివారం ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ భక్తులు అరుణాచలంకు వెళ్లటానికి ఏర్పాటు చేసిన బస్సు ఫిబ్రవరి 10వ తేదీన రాత్రి 9:15కి గుంటూరు బస్టాండ్ నుంచి బయలు దేరి 11న తెల్లవారు జామున శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీ పురం గోల్డెన్ టెంపుల్ ఆయా ఆలయాలను దర్శించుకుని అక్కడ నుంచి బయలు దేరి 12న పౌర్ణమి రోజు ఉదయం 4గంటలకు అరుణాచలం చేరుకుని గిరి ప్రదక్షిణలు ముగించుకుని అరుణాచలేశ్వరుని దర్శించుకొని సాయంత్రం తిరుగు ప్రయాణం చేయనున్నట్లు వివరించారు. ప్రయాణానికి ఒక్కో టికెట్ ధర రూ.2420గా అధికారులు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రయాణికులు అదనపు సమాచారం కోసం 7382897459, 7382896403 ఫోన్ నెంబర్లుకు కాల్ చేసి సమాచారం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కొల్లిపర, తెనాలి వారితో పాటు జిల్లా లోని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు.

నేడు పంచముఖి వారాహీ విగ్రహ పునఃప్రతిష్ట

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో సోమవారం ఉదయం 8:45 నిమషాలకు శ్రీవారాహీ అనుగ్రహ పీఠంలో వేద మంత్రాల నడుమ శ్రీపంచముఖి వారాహీ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వారాహీ అమ్మవారి ఉపాసన పుష్కరకాలం(12 సంవత్సరాలు) పూర్తయిన సందర్భంగా అమ్మవారి విగ్రహం ఆలయంలో పండితుల సూచన మేరకు పునఃప్రతిష్ఠ చేయటం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజకార్యక్రమాలల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన




తెనాలి: అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోవటంపై సీపీఎం నాయకులు ఆదివారం నిరసన తెలియజేశారు. స్థానిక మార్కెట్ సెంటర్లోని గాంధీజీ బొమ్మవద్ద ఆ పార్టీ నాయకులు నిరసన నినాదాలు చేవారు. సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థికమంత్రి పార్లమెంటులో ప్రకటించిన 2025 బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని చెప్పారు. రాష్ట్రవిభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుత బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించి ఆదుకుంటారని ఎదురుచూసిన వారికి కేంద్రం నిరాశను మిగిల్చిందని చెప్పారు. బడ్జెట్లో విభజన చట్టం ఊసే లేదన్నారు. పారిశ్రామిక కార్మికులకు ప్రస్తుత రూ.1000 పింఛనును రూ.7,500లకు పెంచుతారని ఎదురుచూస్తే ఆశాభంగం కలిగించారని చెప్పారు. ఉపాధిహామీ పథకానికి కూడా ప్రస్తుత ధరలకు అనుగుణంగా నిధుల కేటాయింపు జరగలేదన్నారు. బాధ్యత కలిగిన రాజకీయపార్టీలు బడ్జెట్‌లో రాష్ట్రానికి అవసరమైన నిధులు కేటాయించని కేంద్రాన్ని ప్రశ్నించకపోవటం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రైతులకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు.. సేంద్రియ వ్యవసాయానికి నిధులు లేకుండా అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఎరువుల ధరలకు రెక్కలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. సీఐటీయూ నాయకుడు షేక్ హుస్సేన్‌వలి తన ప్రసంగంలో ప్రజల కొనుగోలు శక్తి పెంచకుండా ఆర్థికాభివృద్ధి జరగదని చెబుతూ బడ్జెట్ అందుకు అనుగుణంగా లేదన్నారు. పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉందన్నారు. నిరసనలో రాజశేఖర్, మాగుంట యలమందయ్య, ఓ.దుర్గాప్రసాద్, కోగంటి భాస్కరచంద్, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

లక్ష డప్పులు..వేల గొంతులు పోస్టర్ ఆవిష్కరణ

తెనాలిరూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కోరుతూ ఈ నెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ సారథ్యంలో నిర్వహిస్తున్న 'లక్ష డప్పులు.. వేయి గొంతులు' కార్యక్రమం పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. రూరల్ గ్రామం కొలకలూరు బాబు జగ్జీవన్‌రామ్ రీడింగ్ రూమ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అలపాటి కరుణ, ఎస్.మురళీధర్, కె.నాగేశ్వరరావు, కె.కిషోర్, కె.నాగరాజు, కొలకలూరు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

చదువులమ్మ చెట్టు నీడలో..

తెనాలి: 'హలో నువ్వు...కవితవే కదూ...అవును కదా... బాగానే గుర్తుపట్టాను...' అంటూ ఓ నేస్తం సంభ్రమాశ్చర్యం! 'అరేయ్ సుధాకర్ నువ్వు బాగా మారిపోయావురా...' అంటూ కౌగిలింత చేసుకుని మరో స్నేహితుడి కామెంట్. 'వెంకట్ కనీసం అప్పుడప్పుడైనా పలకరించొచ్చు కదరా...' అంటూ ఇంకొకరి నిష్టూరం...! ఒకనాటి నేస్తాల కుశల ప్రశ్నల సందడి ఇది. ప్రశాంత వాతావరణంలో ఊరికి దూరంగా నారాకోడూరు రోడ్డులోని సుల్తానాబాద్‌లో గల హోటల్ స్వర్ణ ఇన్ ఆదివారం మాత్రం చక్కగా ముస్తాబై వచ్చిన స్నేహితులతో రంగుల సీతాకోకచిలుకలా కనిపించింది. నవ్వులు, కేరింతలతో తుళ్లిపడింది. స్థానిక మారీసుపేటలోని నల మోతు చెంచు రామానాయుడు మున్సిపల్ హైస్కూలులో 1999–2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులే ఈ సందడికి కారణం. పదో తరగతి చదివి పాతికేళ్లయిన సందర్భంగా రీయూనియన్-రజతోత్సవ వేడుకలను అట్టహాసంగా జరుపుకొన్నారు. అనుకున్న సమయానికి అంతా వచ్చారు. ఒకరినొకరు గుర్తుపట్టి, కుశల ప్రశ్నలు వేసుకున్నారు. కొందరైతే పట్టరాని సంతోషంతో ఉద్విగ్నతకు లోనయ్యారు. గుండె తడితో కళ్లు చెమ్మగిల్లిన అనుభూతిని పొందారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తోటివారిని పలకరించారు. వారు చేస్తున్న వృత్తి/ఉద్యోగం, కుటుంబం వివరాలను తెలుసుకున్నారు. చిరునామాలు, సెల్‌నంబర్లను మార్చుకున్నారు. తమకు పాఠాలు బోధించిన నాటి ఉపాధ్యాయులనూ ఆహ్వానించుకుని, వారిని సత్కరించుకుని కృతజ్ఞతలు చెప్పుకొన్నారు. విందుభోజనం చేసి, ఆటపాటతో కొంతసేపు గడిపారు. చివరగా గ్రూప్ ఫొటో తీసుకున్నారు. మరోసారి కలుద్దామంటూ వీడ్కోలు తీసుకున్నారు. మధురమైన జ్ఞాపకాలను మదినిండుగా నింపుకొని తిరుగుపయనమయ్యారు. రఘురామిరెడ్డి, రాకేష్, ప్రవీణ, వరలక్ష్మి, కేశవ తదితరులు పర్యవేక్షించారు.



ఉచిత దంత వైద్యశిబిరం

తెనాలి: పట్టణానికి చెందిన బెస్ట్ డెంటల్ అండ్ ఇంప్లాంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మారీసుపేటలోని అప్పలస్వామి ఆలయం వద్ద ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దంత వైద్యనిపుణురాలు డాక్టర్ హిమబిందు ఓగిరాల దంత పరీక్షలు చేసి, అవసరమైనవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రతివారం నిర్వహిస్తున్న ఉచిత దంత వైద్యశిబిరాన్ని అవసరమైనవారు సద్వినియోగం చేసుకోవాలని రమేష్‌బాబు సూచించారు. దంత సమస్యలపై అవగాహన కల్పిస్తూ సమస్యలు ఉన్నవారికి తగిన సూచనలు, సలహాలనిస్తూ కావాల్సినవారికి ఉచితంగా మందులను కూడా ఇస్తున్నామని తెలిపారు.



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు